


ఢిల్లీ నుంచి వచ్చిన సుప్రీం సాధికార కమిటీని కలిశాక తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, పార్టీ నేతలు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, దేవీప్రసాద్ తదితరులు

# రైతుకో న్యాయం.. సీఎంకో న్యాయమా?

**రైతు తన పొలంలో చెట్టు నరికినా జరిమానా వేస్తరు.. కంచ గచ్చిబౌలిలో వేల సంఖ్యలో చెట్లు నరుకుతుంటే ఫారెస్ట్, రెవెన్యూశాఖ అధికారులు ఏం చేస్తున్నరు?: హరీశ్**

- **హెచ్‌సీయూ భూముల అంశంలో ప్రభుత్వం నిబంధనల ఉల్లంఘన**
- **రాత్రివేళల్లో అటవీ సంపద కూల్చివేత**
- **ప్రమాదంలో వన్యప్రాణుల మనుగడ**
- **సుప్రీం, హైకోర్టు తీర్పుల బేఖాతరు**
- **అటవీ, వన్యప్రాణి చట్టాలకు తూట్లు**
- **కంచే.. చేనుమేసినట్టుగా కాంగ్రెస్ సర్కారు వ్యవహారం**
- **మండిపడ్డ మాజీ మంత్రి హరీశ్‌రావు**
- **సెంట్రల్ కమిటీకి హరీశ్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ బృందం నివేదిక**
- **200 పేజీల డాక్యుమెంట్స్, ఫొటోలు అందజేత**

హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ) : కంచ గచ్చిబౌలి భూముల్లో రేవంత్ సర్కారు పర్యావరణ, జీవవైవిధ్య విధ్వంసానికి పాల్పడిందని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. 50 జేసీబీలతో రాత్రివేళల్లో అటవీ సంపదను కూల్చివేసి వన్యప్రాణుల మనుగడను ప్రమాదంలో పడేసిందని పేర్కొన్నారు. కంచే.. చేనుమేసిన చందంగా సర్కారు సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులను ఉల్లంఘించిందని, అటవీ, వన్యప్రాణి, వాల్టా చట్టాలకు తూట్లు పొడిచిందని వెల్లడించారు. ఈ మేరకు సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీకి హరీశ్‌రావు నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రతినిధి బృందం గురువారం 11 పేజీలతో రిప్రంజంటేషన్, 200 పేజీల నివేదికను అందజేసింది. హైదరాబాద్‌లోని హోటల్ తాజ్‌కృష్ణలో సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ చైర్మన్ సిద్ధార్థదాస్, సభ్యులు చంద్రప్రకాశ్ గోయల్, సునీల్ లెమనయ్య, చంద్రదత్‌లను హరీశ్‌రావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, కాలేరు వెంకటేశ్, పార్టీ నేతలు దేవీప్రసాద్, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ కలిశారు. కంచ గచ్చిబౌలి భూముల్లో రేవంత్ సర్కారు చేస్తున్న పర్యావరణ విధ్వంసం, ఉల్లంఘనలు, హెచ్‌సీయూ విద్యార్థులు, ప్రకృతి ప్రేమికులు, పర్యావరణవేత్తలు లేవనెత్తుతున్న అంశాలు, వాస్తవాలతో కూడిన నివేదికను సమర్పించారు. అనంతరం తెలంగాణభవన్‌లో పార్టీ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. 'పేద రైతు తన పొలంలోని చింతచెట్టునో, యాపచెట్టునో కొడితే పోలీసులు, ఎమ్మార్వో వెళ్లి లక్షల్లో జరిమానా విధిస్తరు.. వేల సంఖ్యలో చెట్లు నరుకుతుంటే ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నరు? రైతుకు ఒక న్యాయం, సీఎంకు ఒక న్యాయమా?' అని నిలదీశారు. రైతుకైనా, పేద వాడికైనా, ముఖ్యమంత్రికైనా సమాన న్యాయం ఉండాలని డిమాండ్ చేశారు.

### నేరపూరిత నిర్లక్ష్యం కనిపిస్తలేదా?

అనుమతి లేకుండా చెట్లు కూల్చుతున్నారని బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పీసీసీఎఫ్‌కు ఫిర్యాదు చేసినా కూడా స్పందించరా? అని హరీశ్ ప్రశ్నించారు. యూనివర్సిటీ విద్యార్థులు ధర్నా చేస్తే కనిపించడం లేదా? అని నిలదీశారు. అటవీశాఖ నేరపూరిత నిర్లక్ష్యం వల్లే వేల సంఖ్యలో చెట్లు కుప్ప కూలాయని, జింకలు మృత్యువాత పడ్డాయని విమర్శించారు. '2002 వాల్టా యాక్టు ప్రకారం, ఎవరైనా చెట్టు కొట్టాలంటే అనుమతి తీసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం 2017లో ఇచ్చిన జీవో 23 ప్రకారం.. చెట్టు కొట్టాలన్నా కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి అటవీశాఖ అనుమతి తీసుకోవాలి. కానీ, అటు చట్టాన్ని, ఇటు ప్రభుత్వ జీవోను ఉల్లఘించారు' అని విమర్శించారు. ఫారెస్టు నేచర్ కలిగిన భూముల వివరాలు ఇవ్వాలని 2025 మార్చి 4న సుప్రీంకోర్టు అన్ని రాష్ట్రాలను కోరితే.. ఆ రకమైన భూమలను కాంగ్రెస్ ప్రభుత్వం తెగనమ్ముతున్నదని మండిపడ్డారు. అశోక్‌కుమార్ శర్మ ఐఎఫ్‌ఎస్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం.. ఫారెస్టు నిర్వచనం.. అటవీ భూమే కాదు, పట్టా భూమి అయినా పది హెక్టార్లు ఉండి, 0.4 డెన్సిటీ ఆఫ్ చెట్లు ఉండాలి. కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాల్లో 0.6 డెన్సిటీ ఆఫ్ చెట్లు ఉన్నాయి. హైడ్రా కూల్చివేతల విషయంలో శని, ఆదివారాల్లో కూల్చొద్దని హైకోర్టు హెచ్చరించింది. దాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం ఉల్లంఘించింది. ఉగాది, రంజాన్ ఆదివారం సెలవులు చూసుకొని విధ్వంసం చేశారు. ప్రభుత్వం చేసిన ఉల్లంఘటనలను కమిటీకి ఆధారాలతో సహా వివరించాం' అని హరీశ్ వెల్లడించారు.

*ఆవాసాలు కోల్పోయి జంతువులు ఇండ్లల్లకు వస్తున్నాయి. మూడు జింకలు చచ్చిపోయినయి. జింకను చంపినందుకు బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్‌ను జైల్లో పెట్టిండ్రు. మరి మూడు జింకలను చంపితే రేవంత్‌రెడ్డిపై ఏం చర్యలు తీసుకోవాలె? ఈ ప్రభుత్వంపై ఏం చర్యలు తీసుకోవాలె. ఏడేండ్ల శిక్ష వేయాలని చట్టం ఉన్నది. హైదరాబాద్ నడిబొడ్డున 400 ఎకరాల్లో పర్యావరణ విధ్వంసం జరిగితే ఇక్కడే ఉన్న పీపీబీ, అటవీశాఖ, రెవెన్యూ శాఖలు ఏం చేస్తున్నయి? నిద్రపోతున్నయా? -హరీశ్‌రావు*

### ఇవాళ రేవంత్‌రెడ్డి చేస్తున్నదేమిటి?

కంచ గచ్చిబౌలి భూమిని తాకట్టు పెట్టి రూ.10 వేల కోట్లు అప్పు తీసుకున్న ప్రభుత్వం.. అప్పు ఇప్పించిన వ్యక్తికి (బ్రోకర్ సంస్థ) రూ. 169.84 కోట్ల ఫీజు చెల్లించందని హరీశ్ విమర్శించారు. సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చిన తర్వాత కూడా హెచ్‌సీయూలో ఈ భూములు టీజీఐఐసీకి చెందినవే అని బోర్డులు పెట్టారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ హయాంలో కొత్త సచివాలయం కట్టాలని నిర్ణయిస్తే ఇదే రేవంత్‌రెడ్డి 10-20 చెట్లను నరుకుతున్నారని గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేయడంతోపాటు హైకోర్టు, సుప్రీంకోర్టులో కూడా కేసులు వేశారని గుర్తుచేశారు. ఇవాళ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్నదేమిటని ప్రశ్నించారు. వందల ఎకరాల్లో లక్షల కొద్దీ చెట్లు కొడుతున్న సీఎంపై, సీఎస్‌పై, పోలీసు అధికారులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించిన పాపానికి హెచ్‌సీయూ విద్యార్థులను జైలులో పెట్టారని, దీనికి బాధ్యత హోంమంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డిదే అన్నారు. ప్రభుత్వం చే యాల్సిన పనిని విద్యార్థులు చేస్తే అరెస్టు చేసి, జైల్లో పెడతారా? అని ప్రశ్నించారు. సీఎంపై ఏ పోస్టు పెట్టినా వారిని జైలులో పెడుతున్నారని, మరి ఇవాళ వేలాది చెట్లు నరికినా, జింకలను చంపినా ఎందుకు డీజీపీకి కనిపించడం లేదని నిలదీశారు. నేరం చేస్తుంటే చూస్తూ ఊరుకున్న ప్రతివారూ నేరస్తులేనని స్పష్టంచేశారు. ఆ భూములు హెచ్‌సీయూకే చెందాలని తాము కమిటీకి విన్నవించినట్టు తెలిపారు. హెచ్‌సీయూ భూము ల్లో తాము కొట్టిన వాటిలో కేవలం సుబాబుల్ చెట్లు మా త్రమే ఉన్నాయని అటవీ అధికారులు చెప్తున్నారని, సుబాబులే కాదు.. అనేక ఔషధ మొక్కలున్నాయని స్పష్టంచేశారు. ఈ భూ ముల్లో చెరువు కూడా ఉన్నదని, చెట్ల నరికివేతతో ఏడు చట్టాలను సీఎం రేవంత్‌రెడ్డి దుర్వినియోగం చేశారని విమర్శించారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, కాలేరు వెంకటేశ్, మాజీ మంత్రి కొప్పు ల ఈశ్వర్, పార్టీ నేతలు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, దేవీప్రసాద్, హరి రమాదేవి పాల్గొన్నారు.

*ఒక చెట్టు నరికితే రెండు చెట్లు నాటాలనే నిబంధన ఉన్నది. అలా అనుమతి పొందిన తర్వాత చెట్టు కొట్టాలి. కానీ, కంచ గచ్చిబౌలి భూముల విషయంలో ప్రభుత్వం ఎలాంటి దరఖాస్తు పెట్టలేదు. అటవీశాఖ అనుమతి తీసుకోలేదు. వేలాది చెట్లను పీకిపడేశారు. చెట్లు కొట్టడానికి రక్షణ కల్పించాలని పోలీస్‌స్టేషన్లలో టీజీఐఐసీ దరఖాస్తు చేసింది. పోలీసులు ఇది చట్టబద్ధమైందా? కాదా? అని ఆలోచన చేయాలె. చెట్లు నరకడానికి ఫారెస్టు అనుమతి ఉన్నదా? వాల్టా చట్టం అనుమతి ఉన్నదా? తెలుసుకొని పోలీసులు అనుమతివ్వాలె. కానీ, పోలీసు రక్షణలో రాత్రింబవళ్లు 50 బుల్డోజర్లు పెట్టి చెట్లను ఊచకోత కోసిండ్రు.*

*-బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు*

## ఆర్టీసీలో ఎస్‌ఆర్‌బీఎస్ ఎత్తివేత?

- **20 వేల మంది పొట్టగొట్టే ప్రయత్నం**
- **రిటైర్డ్ ఉద్యోగుల స్కీమ్‌కు సంస్థ ఎసరు?**
- **వెనక్కి తీసుకోవాలని జేఏసీ డిమాండ్**

హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు ఆదెరువుగా ఉన్న స్టాఫ్ రిటైర్మెంట్ బెనిఫిట్ స్కీమ్ (ఎస్‌ఆర్‌బీఎస్)ను క్రమంగా మూసివేసే కుట్రకు ఆర్టీసీ తెరతీసిందని కార్మిక సంఘాల జేఏసీ నేతలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ ప్రయత్నాలను విరమించుకోవాలని కోరుతూ జేఏసీ చైర్మన్ వెంకన్న, కోచైర్మన్ హన్మంతు ముదిరాజ్, వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి, కన్వీనర్ మౌలానా యాజమాన్యానికి గురువారం లేఖ రాశారు. ఈ మేరకు ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్‌ఆర్‌బీఎస్‌ను 1989 నుంచి అమలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ఈ స్కీమ్ ద్వారా నెలవారీ ఆర్థిక ప్రయోజనం కలిగిస్తున్నదని తెలిపారు. కీలక నిర్ణయాలు తీసుకునేముందు యూనియన్లను సంప్రదించాలని చెప్పారు. స్కీమ్‌ను ఎత్తివేసేందుకు ప్రయత్నిస్తే జేఏసీ ఆధ్వర్యంలో జరిగే ఆందోళనలకు యాజమాన్యమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.



ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంలో పేదోళ్లకు ఇళ్లు ఇవ్వండి సారూ అంటూ మంత్రి పొంగులేటి చేతులు పట్టుకొని బతిమిలాడుతున్న మహిళలు

## సారూ.. ఇండ్లివ్వరూ..

- **మంత్రి పొంగులేటి చేతులు పట్టుకొని బతిమిలాడిన మహిళలు**
- **దశలవారీగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చిన మంత్రి**
- **ప్రశ్నించిన వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 10 : 'ఒక్కసారి వచ్చి మా ఇళ్లు చూడండి.. పేదోళ్లకు ఇళ్లు మంజూరు చేయండి..' సారూ అంటూ రాముల ఆధ్వర్యంలో మహిళలు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చేతులు పట్టుకొని బతిమిలాడారు. స్పందించిన మంత్రి.. దశలవారీగా అందరికీ ఇళ్లు ఇస్తాం. మీ ఇంట్లో భోజనం కూడా చేస్తా ం.. అంటూ మహిళలను బుజ్జగించారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలో మంత్రి పొంగులేటి గురువారం భారీ పోలీసు బందోబస్తు మధ్య పర్యటించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు, పథకాల అమలు తీరుపై ప్రజలు ప్రశ్నించకుండా ఎక్కడికక్కడ పోలీసులు జాగ్రత్తలు చేపట్టారు. సమస్యలపై ప్రశ్నించేందుకు యత్నించినవారిని అడ్డుకున్నారు. మేడిదపల్లిలో రావుల జగన్నాథరెడ్డి, మరికొందరు రైతులు రైతు రుణమాఫీ, రైతు భరోసాపై మంత్రిని నిలదీసేందుకు య త్నించగా.. వారిని పోలీసులు అదుపు చేశారు. తిరుమలాయపాలెంలో తురక స్వామి అనే యువకుడు సమస్యలపై ప్రశ్నించే ప్రయత్నం చేయగా.. అతడిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మంత్రి పర్యటనలో ఎక్కడ చూసినా పోలీసుల హంగామా కనిపించింది.

# ఆ ఐదు వేల కోట్లు ఏమాయె?

## కంచ గచ్చిబౌలి భూములను తాకట్టు పెట్టి రూ.10 వేల కోట్ల రుణం తెచ్చిన రేవంత్ సర్కారు

**ఆ సొమ్ముతో రైతు భరోసా, ఆత్మీయ భరోసా ఇస్తామంటూ అనుకూల మీడియాకు లీకులు**

- **రైతు భరోసాకు ఇచ్చింది రూ.ఐదు వేల కోట్లే!**
- **ఇంకా సగంమంది రైతులకు అందని పెట్టుబడి సాయం**
- **మరి మిగిలిన రూ.5 వేల కోట్లు ఏమైనట్టు?**
- **తాకట్టు సొమ్ము, ఎవరి జేబుల్లోకి పోయినట్టు?**
- **దీని వెనుక ఉన్న సర్కారు పెద్దలెవరు?**
- **ఆ ముగ్గురికీ పప్పుబెల్లంలా పంచి పెట్టేశారా?**
- **ప్రభుత్వ బ్యాంకులు ఉండగా... ప్రైవేటు బ్యాంకు వద్ద ఎందుకు తాకట్టు పెట్టినట్టు?**

హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): రూపాయి అప్పు చేసినా సరే పైసా పైసా చూసుకొని జాగ్రత్తగా ఖర్చు పెట్టాలని పెద్దలు చెప్తుంటారు. అలాంటిది అత్యంత విలువైన కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూములను కుదవ పెట్టి మరీ రూ.10 వేల కోట్లు అప్పు తెచ్చిన రేవంత్‌రెడ్డి సర్కారు ఆ పైసలను ఏం చేసింది? ఎవరికి ధారపోసింది? అనేది అత్యంత రహస్యంగా మారింది. అప్పు తెచ్చిన సొమ్ములో సగం పక్కదారి పట్టింది. అప్పు తెచ్చిన పైసలతో రైతులకు రైతుభరోసా, కూలీలకు ఆత్మీయ భరోసా ఇస్తామంటూ సర్కారు పెద్దలు లీకులిచ్చారు. కానీ, ఇప్పటివరకు రైతుభరోసా కింద రూ.5 వేల కోట్లు మాత్రమే పంపిణీ చేసింది. దీంతో మిగిలిన రూ.5 వేల కోట్ల సొమ్ము ఎవరి జేబుల్లోకి పోయింది? ఏమైపోయింది? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలు భూములను తాకట్టు పెట్టి అప్పులు చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? ఆ అప్పు ఎందుకు తెచ్చింది? ఎవరి కోసం తెచ్చింది? ఏ లక్ష్యం కోసం తెచ్చింది? ఆ లక్ష్యం నెరవేరిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో ప్రభుత్వం వేస్తున్న ప్రతి అడుగు, తీసుకుంటున్న ప్రతి చర్య అనుమానాలు రేకెత్తించేలా ఉన్నాయి. తాకట్టు పెట్టిన భూములను నాలుగు నెలలు తిరగకముందే అమ్మేయాలనుకోవడం, చిరకాల ప్రత్యర్థిపై యుద్ధం ప్రకటించినట్టుగా బుల్డోజర్లను హెచ్‌సీయూ భూములపైకి దండయాత్ర మాదిరిగా పంపడం, ఎకరం రూ.100 కోట్ల విలువైన భూములను రూ.52 కోట్లకే అమ్మేయాలనుకోవడం.. ఇలా ప్రతి అడుగూ అనుమానాస్పదమే.

### ఆ పైసలతో రైతు భరోసా ఎందుకివ్వలేదు?

రైతుల మాటున భూములను తాకట్టు పెట్టి తెచ్చిన సొమ్మును నొక్కేసేందుకు సర్కారు పెద్దలు స్కెచ్ వేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాలను తాకట్టు పెట్టడం ద్వారా సమకూరే రూ.10 వేల కోట్లలో సగం సొమ్మును కొట్టేసేందుకు సర్కారులోని ఓ నలుగురు పెద్దలు స్కెచ్ వేశారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇందులోభాగంగానే తాకట్టు సొమ్ము నుంచి కాంట్రాక్టుల బిల్లులు చెల్లించేలా ఒప్పందాలు కుదిరినట్టు ప్రచారం జరుగుతున్నది. ఇది నేరుగా చేస్తే ప్రజల్లో వ్యతిరేకత వచ్చే ప్రమాదం ఉండటంతో, దీనికి పథకాల ముసుగు వేశారనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. కంచ గచ్చిబౌలిలోని భూములను తాకట్టు పెట్టడం ద్వారా సమకూరే రూ.10 వేల కోట్లతో రైతులకు రైతుభరోసా, కూలీలకు ఆత్మీయ భరోసా ఇస్తామంటూ ప్రభుత్వం లీకులు ఇచ్చింది. కానీ, అప్పు తెచ్చిన సొమ్ము పక్కదారి పట్టింది. రైతుల ఖాతాల్లో పూర్తిగా జమ కాలేదు. రైతులకు రూ.5 వేల కోట్లు మాత్రమే పంపిణీ చేసింది. గత సంవత్సరం డిసెంబర్ 28న భూముల తాకట్టు సొమ్ము రూ.10 వేల కోట్లు ప్రభుత్వ ఖజానాలో జమైనట్టు సమాచారం. అంటే తాకట్టు నిధులు ప్రభుత్వానికి చేరి ఇప్పటికే మూడు నెలలు గడిచాయి. కానీ, ఇంకా సగం మంది రైతులకు రైతుభరోసా పెట్టుబడి సాయం అందలేదు. రైతుభరోసా కోసం మొత్తం రూ.9 వేల కోట్లు అవసరం కాగా, ఇప్పటివరకు రూ.5 వేల కోట్లు మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఈ విధంగా అప్పు తెచ్చిన సొమ్ములో ఇంకా రూ.5 వేల కోట్ల వరకు మిగిలిపోయాయి. అయినప్పటికీ, సర్కారు పెద్దలు ఇచ్చిన లీకుల ప్రకారం రైతులందరికీ రైతుభరోసా ఎందుకు ఇవ్వలేదు? కూలీలకు ఆత్మీయ భరోసా ఎందుకు జమ చేయలేదు? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.



**తాకట్టు పెట్టిన మూడు నెలల్లోనే అమ్మడం ఎందుకు? ఆ కంపెనీల్లో నేతలకు వాటాలే కారణమా?**

**కంచ గచ్చిబౌలిలోని** 400 ఎకరాల భూములను ప్రభుత్వం గత సంవత్సరం డిసెంబర్‌లో ఐసీఐసీఐ బ్యాంకుకు తాకట్టు పెట్టింది. రూ.10 వేల కోట్ల రుణాన్ని తీసుకున్నది. మూడు నెలల క్రితమే తాకట్టు పెట్టిన సదరు భూమిని ఇప్పుడు ఏకంగా అమ్మేయాలని నిర్ణయించింది. అలాంటప్పుడు ఎందుకు తాకట్టు పెట్టినట్టు? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నిర్ణయం వెనుక భారీ కుట్ర ఉన్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ భూమిని పలు సాఫ్ట్‌వేర్ కంపెనీలకు విక్రయించాలని భావించినట్టు తెలిసింది. ఆయా సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ప్రభుత్వంలోని ఓ ముగ్గురు కీలక వ్యక్తులకు వాటాలు ఉండటమే ఇందుకు కారణమనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముందుగానే సదరు కంపెనీలతో మాటామంతి పూర్తి చేసుకొని ఆ భూమిని అగ్గువ ధరకు కట్టుబెట్టేందుకు నిర్ణయించుకున్నారనే ఆరోపణలున్నాయి.

### రైతుభరోసా లెక్కలపై సర్కారు మౌనం?

రైతు భరోసా నిధుల విడుదలపై ప్రభుత్వం నుంచి మౌనమే సమాధానంగా మారింది. గతంలో కేసీఆర్ సర్కారు.. ప్రతిరోజూ ఎంత మంది రైతులకు, ఎంత మొత్తం పంపిణీ చేసిందో వివరాలతో ప్రకటన ఇచ్చేది. కానీ, కాంగ్రెస్ సర్కారు గోప్యత పాటిస్తున్నది. ఏ రోజు ఎంత మందికి ఇచ్చారో వెల్లడించడం లేదు. కనీసం ఇప్పటివరకు ఎంత మందికి, ఎంత సొమ్ము జమ చేశారనే వివరాలు కూడా తెలపడం లేదు. రైతులకు చెల్లించే సొమ్ము విషయంలో ప్రభుత్వం ఎందుకు గోప్యత పాటిస్తున్నదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మూడెకరాల వరకు వివరాలను వెల్లడించిన సర్కారు ఆ తర్వాత గోప్యత పాటిస్తున్నది.

**కమీషన్ల కోసమే ప్రైవేటు బ్యాంకుకు అప్పగించారా?**

**కంచ గచ్చిబౌలి** భూములను తాకట్టు పెట్టి రుణం తీసుకునేందుకు ప్రభుత్వం ప్రైవేటు బ్యాంకు ఐసీఐసీఐని ఎంచుకున్నది. ఎస్బీఐ వంటి ప్రభుత్వ బ్యాంకులను పక్కనపెట్టి రిస్క్‌తో కూడిన ప్రైవేటు బ్యాంకులో రూ.వేల కోట్ల విలువైన భూమిని తాకట్టు పెట్టడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీని వెనుక కమీషన్ల కహానీ ఉన్నట్టు అనుమానాలున్నాయి. సాధారణంగా ప్రభుత్వ బ్యాంకులతో పోల్చితే ప్రైవేటు బ్యాంకుల్లో ఆయా ఉద్యోగులు సాధించిన లావాదేవీలను బట్టి ఇన్సెంటివ్స్, ప్రమోషన్లు ఉంటాయి. దీంతోపాటు అధిక మొత్తంలో బ్యాంకు ట్రాన్సాక్షన్స్ చేసేవారికి, డిపాజిట్లు చేసే వారికి సదరు బ్యాంకులు పెద్ద మొత్తంలో కమీషన్లు ఇస్తాయనే ఆరోపణలున్నాయి. ఇందులో భాగంగానే రిస్కులేని ప్రభుత్వ బ్యాంకులను కాదని, రిస్క్‌తో కూడిన ప్రైవేటు బ్యాంకులో 400 ఎకరాలు కుదవపెట్టి రుణం తీసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వివరాలు వెల్లడిస్తే అసలు నిజాలు ప్రజలకు తెలిసిపోతాయని, అప్పు తెచ్చి రైతులకు ఇస్తామని చెప్పి.. ఇప్పుడు ఎందుకు ఇవ్వడం లేదనే ప్రశ్నలు ఎదురవుతాయనే భయం ప్రభుత్వ పెద్దల్లో ఉన్నట్టుగా తెలుస్తున్నది.

### ఆ సొమ్ము ముగ్గురు జేబుల్లోకేనా?

కంచ గచ్చిబౌలి భూముల తాకట్టు సొమ్ములో మిగిలిన రూ.5 వేల కోట్లు రైతుల ఖాతాల్లోకి కాకుండా కాంట్రాక్టర్ల జేబుల్లోకి వెళ్లాయనే అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి. బడా కాంట్రాక్టర్ అయిన ఒక మంత్రి, ఇటీవల మంత్రివర్గంలో చోటు దక్కుతున్నదంటూ ప్రచారం జరిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ఒక ఎమ్మెల్యే, అదే జిల్లాకు చెందిన ఒక ఎంపీకి చెందిన సంస్థలు, బంధువుల సంస్థల కాంట్రాక్టు బిల్లులకు ఈ సొమ్ములు ముట్టజెప్పినట్టు ప్రచారం జరుగుతున్నది. ఇందుకోసం ఈ ముగ్గురు నేతలు ప్రభుత్వంలోని ఓ ముఖ్యనేతతో పలు దఫాలుగా చర్చలు జరిపినట్టు తెలిసింది. దీంతో తాకట్టు సొమ్మును కాంట్రాక్టర్లకు ముట్టజెప్పేందుకు లైన్‌క్లియర్ అయిందని, తద్వారా ప్రభుత్వంలోని పలువురు పెద్దలకు పెద్ద ఎత్తున కమీషన్లు ముట్టినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విధంగా రైతులు, కూలీల పేరు చెప్పి ప్రభుత్వ పెద్దలు తాకట్టు పెట్టిన సొమ్మును తమ వారికి పప్పు బెల్లంలా పంచేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### బ్రోకర్లకు రూ.170 కోట్లు!

అప్పు చేసి పంచి పెట్టడమంటే ఇదేనేమో! రూ.వందల కోట్ల ప్రజాధానాన్ని కాంగ్రెస్ సర్కారు బ్రోకర్లకు ధారపోస్తున్నది. కంచ గచ్చిబౌలి భూములను ఐసీఐసీఐ బ్యాంకుకు తాకట్టు పెట్టి రూ.10 వేల కోట్ల రుణం ఇప్పించేందుకు ఒక ప్రైవేటు సంస్థ మధ్యవర్తిత్వం వహించింది. ఇందుకోసం సదరు సంస్థకు కాంగ్రెస్ సర్కారు దాదాపు రూ.170 కోట్లు కమీషన్ రూపంలో చెల్లించింది. ఇంత భారీ మొత్తంలో ప్రజాధానాన్ని బ్రోకర్లకు సమర్పించడం ఏమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అయితే ఇందులో ముఖ్య నేతలకు ఎంత ముట్టిందో అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

### కేసీఆర్‌పై నీలాపనిందలు.. ఇప్పుడు రేవంత్ చేస్తున్నదేమిటి?

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి నాటి సీఎం కేసీఆర్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. భూములు అమ్ముతున్నారంటూ, అప్పులు చేస్తున్నారంటూ విమర్శలు గుప్పించారు. నాడు కేసీఆర్‌పై ఆరోపణలు చేసిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఏం చేస్తున్నారనే ప్రశ్న వినిపిస్తున్నది. కంచ గచ్చిబౌలి భూములను తాకట్టు పెట్టడాన్ని ఆయన ఏ విధంగా సమర్థించుకుంటారని ఆర్థికవేత్తలు ప్రశ్నిస్తున్నారు. దీనికితోడు తాకట్టు పెట్టిన భూమిని, జీవవైవిధ్యం కలిగిన అడవిని ఏకంగా అమ్మేయాలనే నిర్ణయంపై కూడా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నాడు సుద్దులు చెప్పి.. నేడు చేస్తున్నదేమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. నాడు కేసీఆర్ చేసింది తప్పు అయితే, ఇప్పుడు రేవంత్‌రెడ్డి చేసేది ఒప్పెలా అవుతుందని ప్రశ్నిస్తున్నారు.

### ప్రభుత్వ సంస్థలకిస్తేనే కేసులు, విచారణలు.. ఇప్పుడు ప్రైవేటుకిస్తే ఏం చేయాలి?

బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన పలు టెండర్లపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ, నవరత్న సంస్థల్లో ఒకటైన బీహెచ్‌ఈఎల్‌కు ఇచ్చిన టెండర్లపై సైతం ఆయన అవినీతి ఆరోపణలు చేశారు. నాడు కేసీఆర్ ప్రభుత్వరంగ సంస్థలను బతికించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతోనే యాదాద్రి, భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నిర్మాణ పనుల కాంట్రాక్టును బీహెచ్‌ఈఎల్‌కు అప్పగించారు. దీనిపై నాడు ఆరోపణలు చేసిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక కేసులు పెట్టి విచారణకు ఆదేశించారు. కానీ, ఇప్పుడు కంచ గచ్చిబౌలి భూములను ఏకంగా ప్రైవేటు బ్యాంకు ఐసీఐసీఐ వద్ద తాకట్టు పెట్టారు. ప్రైవేటు ఏజెన్సీలను నియమించి వాల్యుయేషన్లు, అమ్మకాలకు సలహాలు తీసుకున్నారు. నాడు ప్రభుత్వరంగ సంస్థలకు ఇచ్చిన టెండర్లపైనే విచారణ చేయించిన సీఎం రేవంత్‌రెడ్డి.. నేడు ప్రైవేటు బ్యాంకులతో లావాదేవీలపై ఎలాంటి విచారణ జరిపిస్తారని ఆర్థికవేత్తలు ప్రశ్నిస్తున్నారు. నాడు కేసీఆర్ చేసింది తప్పే అయితే, నేడు రేవంత్‌రెడ్డి చేస్తున్నది అంతకన్నా పెద్ద తప్పు అని తేల్చి చెప్తున్నారు.

**రూ.100 కోట్ల విలువ రూ.52 కోట్లకు ఎలా తగ్గింది?**

ఐటీ కారిడార్‌కు ఆమడదూరంలో ఉన్న కోకాపేటలో బీఆర్‌ఎస్ హయాంలో ఎకరం భూమి ధర రూ.100 కోట్లు పలికింది. అలాంటప్పుడు ఐటీ కారిడార్‌కు కూతవేటు దూరంలోనే ఉన్న కంచ గచ్చిబౌలి భూమి ధర కూడా అంతకు మించి ఉండాలి. కానీ, కాంగ్రెస్ సర్కారు మాత్రం ధరను అమాంతం తగ్గించేసింది. నిరుడు జూన్‌లో జారీ చేసిన ఉత్తర్వుల్లో కంచ గచ్చిబౌలిలో ఎకరం విలువ రూ.75 కోట్లుగా నిర్ణయించింది. అంటే వాస్తవ ధర కన్నా రూ.25 కోట్లకు ఇక్కడే కోత పెట్టింది. ఆ తర్వాత నిరుడు నవంబర్‌లో ప్రభుత్వం పరీశ్‌రావు పన్సే-రావు అసోసియేట్స్ సంస్థతో ఆ భూమిని వాల్యుయేషన్ చేయించింది. సదరు సంస్థ ఈ విలువను మరింత తగ్గించి ఎకరం రూ.52 కోట్లుగా తేల్చింది. అంటే, కేవలం ఐదు నెలల్లోనే ప్రభుత్వ నిర్ణయించిన ధర కన్నా రూ.23 కోట్లు కోత పెట్టింది. ఈ లెక్కన బీఆర్‌ఎస్ సర్కారు నాటి ధరతో పోల్చితే రూ.48 కోట్లు తగ్గించడం అనుమానాలకు తావిస్తున్నది. భూమి విలువను తగ్గించడం ద్వారా ముఖ్య నేతలు భారీ భూ కుంభకోణానికి తెరతీశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## అప్పల సృష్టికీ బ్రోకర్!

- **ఇదీ రేవంత్‌రెడ్డి సర్కారు ఘనకార్యం**
- **అసెంబ్లీలో సర్కారు లిఖితపూర్వక సమాధానం**

హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి సర్కారు అప్పులు తెచ్చుకొనేందుకు కూడా ఓ బ్రోకరేజ్ సంస్థను పెట్టుకున్నది! కొత్త అప్పులు సృష్టించి ఇప్పించేందుకు ఆ సంస్థకు ప్రభుత్వం కమీషన్ కూడా చెల్లిస్తున్నది. పెద్ద మొత్తంలో అప్పులు చేసి ప్రజలపై భారం మోపడంతోపాటు ప్రజాధనాన్ని పప్పుబెల్లంలా పంచిపెడుతున్నది. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాలను ఐటీ, ఇతర ప్రాజెక్టుల ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (టీజీఐఐసీ)కి కేటాయించింది. ఆ భూములను టీజీఐఐసీ ద్వారా తాకట్టు పెట్టించి, 2024 డిసెంబర్‌లో రేవంత్ సర్కారు రూ.10,000 కోట్ల అప్పు తెచ్చింది. అప్పు సృష్టించి ఇప్పించినందుకు బ్రోకరేజ్ సంస్థగా పని చేసిన 'ట్రస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వయిజర్స్ ప్రైవేటు లిమిటెడ్'కు రాష్ట్ర ప్రభుత్వం రూ.169,83,97,978 చెల్లించింది. అంటే దాదాపుగా రూ.169 కోట్ల ప్రజాధనం బ్రోకరేజ్ సంస్థకు కట్టబెట్టింది. ఇందులో ఇంకో విశేషం ఏమిటంటే.. దీనితోపాటు 18% జీఎస్టీ కూడా ముట్టజెప్పింది. అసెంబ్లీలో బీఆర్‌ఎస్ సభ్యులు అడిగిన ప్రశ్నకు రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చింది. హెచ్‌ఎండీఏ ద్వారా రూ.20 వేల కోట్లు, జలమండలి ద్వారా మరో రూ.10 వేల కోట్లు రుణ సేకరణ బాధ్యతను కూడా ఈ బ్రోకరేజ్ సంస్థకే అప్పగించినట్టు తెలిసింది. న్యాక్ భూములు 50 ఎకరాలు, మహేశ్వరం నియోజకవర్గంలో మరో 20 ఎకరాల భూములను విక్రయించాలని రేవంత్ సర్కారు యోచిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం.